485) ధన్నాసి

ప॥ ఒక్కమనసున నేనుండేగాక। యెక్కడిపనులు దానే యెఱుగడా॥

చ॥ బలుదేహ మిచ్చువాడు ప్రాణము వోసినవాడు। తలపోసగినవాడు దైవమే కాడా।
వెలుపలిలంపటాలు వేవేలు గడించి తాను। మలసి ఇంతలో నన్ను మఱచీనా॥

చ॥ జగము లేలేటివాడు సంసారి జేసినవాడు। తగులై యుండినవాడు తానేకాడా।
బెగడకుండ దినాలు పెరుగజేసేటివాడు। తగినట్టు నడపించ దా నేరడా॥

చ॥ మొదలై యుండేటివాడు ముందర దుదయ్యేవాడు। యెదలోవాడు శ్రీవేంకటేశుడేకాడ।
చదివించి బుద్ధులిచ్చి చైతన్యమైనవాడు। పొదిగి నాదాపుదండై భోగించడా॥